సాక్షి అనకాపల్లి

మంగళవారం । 3 । జూన్ । 2025



రూ. 3 వేల కోట్ల టర్నోవర్ IIలో

విశాఖ విద్య: డీసీసీబీ ద్వారా రూ.3 వేల కోట్లు టర్నోవర్ లక్ష్యంగా పనిచేస్తామని బ్యాంకు చైర్మన్ కోనా తాతారావు అన్నారు.

ఉష్ణోగ్రతలు

సోమవారం

		గరిష్టం/కనిష్టం
అనకాపల్లి	:	38.3/26.5
చోడవరం	:	39.0/28.0



అప్పన్నకు నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది.

వెన్నుపూస విరిగినా జాలి లేదు



ఆమె పేరు నల్లబెల్లి రాజేశ్వరి. గొలుగొండ మండలం పాకలపాడు గ్రామం. ఆమెకు వెన్నుపూస సమస్య ఉంది. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చికిత్స అందించారు. వికలాంగుల సర్టిఫికెట్ దాఖలు చేయగా పింఛన్ మంజూరయింది. గత ఏడాది జూన్ వరకు పింఛన్ అందుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పెన్షన్ ఆగిపోయింది. దీనిపై ఆమె కోర్టును ఆశ్రయించారు. ఆమెలాంటి దీనురాలికి కూడా నిర్దయగా పెన్షన్ తొలగించారు.

రాజకీయ కక్షతోనే..



ఆమె పేరు త్రినాథ. గొలుగొండ మండలం పాకలపాడు గ్రామం. ఆమెకు పుట్టుక నుంచి ఒక కన్ను లేదు. 18 ఏళ్లుగా వికలాంగుల పింఛన్ తీసుకుంటున్నారు. వికలాంగుల సర్టిఫికెట్ కూడా ఉంది. కేవలం రాజకీయ కక్షతో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరురాలన్న నెపంతో పింఛను తొలగించారు. మండల రెవెన్యూ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు విన్నవించుకున్నా ఫలితం లేకపోయింది.



ప్రతి నెలా పెన్షన్ టెన్షన్

ఒకటో తేదీ వచ్చిందంటే చాలు పింఛనుదారుల గుండెల్లో గుబులు మొదలవుతుంది. తమ పేరు ఉంటుందో ఊడుతుందోనన్న భయం వెంటాడుతుంది. గత ప్రభుత్వంలో రాజకీయాలకు అతీతంగా లబ్ధి చేకూరిస్తే, ఇప్పుడు రాజకీయ కక్షతో పెన్షన్లు తొలగిస్తున్నారు. తమ పార్టీ సానుభూతిపరులైతేనే కూటమి సర్కారు కరుణ దక్కుతుంది. నెలకు సుమారు వంద వంతున ఏడాది కాలంలో 10,136 పింఛన్లు తొలగించారు. లబ్ధిదారుల ఏరివేతలో భాగంగా దివ్యాంగులు సైతం మళ్లీ వైద్య పరీక్షలు చేయించుకొని సర్టిఫికెట్లు సమర్పించాలని హుకుం జారీ చేశారు. ఒకటో తేదీన తెలతెలవారుతుండగా వలంటీరు ఇంటికే వచ్చి, ప్రేమగా పలకరించి, పెన్షన్ అందించిన రోజులను తలచుకొని అవ్వాతాతలు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు.





నక్కపల్లి: వృద్ధాప్య పింఛన్ కావాలంటే.. మీ ఇళ్ల వద్దకు రాలేం.. వీధుల్లోకి రావాల్సిందే.. ఒకటో తేదీన ఎక్కడో ఉంటే కుదరదు.. ఊర్లో ఉండాల్సిందే.. మేము పింఛన్లు ఇస్తున్న గ్రామ సచివాలయం లేదా పంచాయతీ కార్యాలయం వద్దకు రావాలి.. ప్రతి నెలా పింఛన్లు బట్వాడా చేస్తున్న ఉద్యోగులు వ్యవహరిస్తున్న తీరు ఇది. వైఎస్సార్‌సీపీ పాలన కంటే గొప్పగా చెప్పుకోవడానికి కూటమి ప్రభుత్వం సామాజిక పింఛన్లను ఒకటో తేదీ లేదా దానికి ఒక రోజు ముందుగానే ఇస్తున్నప్పటికీ పింఛన్‌దారులకు మాత్రం కష్టాలు తప్పడం లేదు. ఒకటో తేదీన పింఛన్ అందుకోకపోతే మరో రోజు ఇస్తారని భరోసా ఉండటం లేదు. ఆ రోజు ఎంత అత్యవసర పని ఉన్నా పింఛన్‌దారులు వాయిదా వేసుకోవాల్సి వస్తుంది. పైగా అందరినీ ఒకచోట ఉంచి గంటలకొద్దీ పింఛన్లు ఇవ్వడంతో ఇబ్బందులు పడుతున్నారు.

నాటి బాధలు అన్నీ ఇన్నీ కావు

అవ్వా తాతలకు ప్రభుత్వం ఇచ్చే పింఛన్ల వ్యవహారంలో పాత రోజులు గుర్తుకు వస్తున్నాయి. పెన్షన్ల కోసం పండుటాకులు పడిగాపులు పడాల్సిన పరిస్థితి వస్తోంది. 2019కు ముందు టీడీపీ ప్రభుత్వంలో వృద్ధులకు ఇచ్చే ఐదొందల పింఛను అందుకోవడానికి రోజంతా కార్యదర్శి కోసం పంచాయతీ కార్యాలయాల వద్ద, రచ్చబండ వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చేది. ఒకవేళ సదరు ఉద్యోగి ఆరోజు రాకపోతే మళ్లీ అతను వచ్చేదాకా రోజూ కార్యాలయాలకు వచ్చి వేచి చూడాల్సి వచ్చేది. పదే పదే తిరగాల్సి రావడంతో పింఛన్లు తీసుకోడానికి వచ్చే వారిలో ఎంతోమందికి వడదెబ్బ తగలడం, ఎక్కువ సేపు వేచి ఉండలేక నీరసపడి అనారోగ్యం పాలవడం వంటి సమస్యలు ఎదురయ్యేవి. ఇక పింఛన్లు తీసుకోగానే, వాటిలో నుంచి వందో యాభయ్యో మామూళ్ల కింద చెల్లించాలి. పింఛనుదారుల్లో ఎవరైనా చనిపోతేనే మరొకరికి కొత్తగా మంజూరు చేసేవారు. జన్మభూమి కమిటీ సభ్యులు చెప్పిన వారికే పింఛన్లు మంజూరు చేసేవారు. తొలి నెల పింఛన్లు గ్రామంలో టీడీపీ నాయకుడికి నైవేద్యంగా సమర్పించుకోవాలి. కొత్త పింఛన్లను ఏడాదికొకమారు జన్మభూమి కార్యక్రమంలో మంజూరు చేసేవారు. అవికూడా ఊరికి నాలుగో, ఐదో అంతే..

ఏడాది పాలన

అంతులేని వేదన

జగనన్న ప్రభుత్వంలో కష్టాలు తప్పాయి..

పింఛన్ల పంపిణీలో అవ్వాతాతల అగచాట్లను స్వయంగా తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటి వద్దే వలంటీర్ల సహాయంతో అందజేస్తామని ప్రకటించారు. ఇచ్చిన మాట ప్రకారం ఒకటో తేదీ వేకువజామునే ఇంటి వద్దకు వలంటీర్లను పంపి పింఛన్లు అందజేసి దేశ చరిత్రలోనే నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. ఎవరి నుంచి ఒక్కపైసా ఆశించకుండా పింఛను మొత్తం అందజేసేవారు. ఎవరైనా అనారోగ్యం పాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతుంటే అక్కడకెళ్లి పింఛను ఇచ్చే సదుపాయం కల్పించారు. కరోనా సంక్షోభంలోనూ పింఛన్‌దారుల ఇంటి వద్దే ఇచ్చేలా చర్యలు తీసుకున్నారు. ప్రతి ఆరు మాసాలకొకసారి కొత్త పింఛన్లు మంజూరు చేసేవారు.

జిల్లాలో మొత్తం సామాజిక పింఛన్లు	కూటమి అధికారంలోకి వచ్చాక రద్దయినవి
2,54,962	10,136

ఏడాది నుంచి మళ్లీ ఇక్కట్లు మొదలు

కూటమి అధికారంలోకి రావడంతోనే వలంటీర్ల వ్యవస్థను రద్దు చేయడంతో మళ్లీ అవ్వాతాతల కష్టాలు మొదలయ్యాయి. సచివాలయ సిబ్బంది ద్వారా పింఛన్లు బట్వాడా చేస్తున్నారు. వీధిలో ఒక చోట కూర్చొని పంపిణీ చేస్తున్నారు. దాంతో పింఛను తీసుకునేందుకు అవ్వాతాతలు అష్టకష్టాలు పడుతున్నారు.

ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తవుతున్నా, కొత్తగా ఒక్క పింఛను మంజూరు చేయలేదు. భర్త చనిపోతే అతడు పొందే పింఛనును భార్యకు వెంటనే ఇవ్వలేదు. పింఛన్ల కోసం కటాఫ్ తేదీ పెట్టి అర్హులకు అన్యాయం చేశారని పలువురు బాధితులు వాపోతున్నారు. జిల్లాలో వివిధ కేటగిరీల కింద 2.54 లక్షల మందికి ప్రభుత్వం పింఛన్లను అందజేస్తోంది. పింఛను తీసుకునే భర్త చనిపోతే వారి భార్యల పేరున మంజూరు చేయడంలోనూ ప్రభుత్వం కక్కుర్తి ప్రదర్శించింది. పైగా స్పౌజ్ పెన్షన్ మంజూరు కోసం 2023 డిసెంబరు 1 నుంచి 2014 అక్టోబరు 31వ తేదీ వరకు కటాఫ్ పెట్టింది. ఇలా జిల్లాలో 3,168 మందికి మాత్రమే వితంతు పింఛన్లు మంజూరు చేసింది.



కొత్త పింఛను కోసం దరఖాస్తు తీసుకోలేదు



నా భర్త ఏడాదిన్నర క్రితం మరణించాడు. అప్పట్లో దరఖాస్తు చేస్తే ఎన్నికల కోడ్ అని ఇవ్వడం మానేశారు. కొత్త ప్రభుత్వం వచ్చేక మంజూరు చేస్తారేమోనని ఆశపడ్డాను. ఈ రోజు వరకు పింఛను మంజూరు చేయలేదు. చాలాసార్లు సచివాలయానికి వెళ్తే కొత్త పింఛను కోసం దరఖాస్తు తీసుకోవడం లేదు. కొత్తవి మంజూరు చేస్తే కబురు చేస్తాంలే అని తిప్పి పంపేశారు. ఇంటి యజమానిని కోల్పోయిన మాకు పింఛను మంజూరు చేయడంలో ఎందుకు వివక్ష చూపుతున్నారో తెలియడం లేదు.

– కిల్లాడ హైమావతి, పాములవాక, కోటవురట్ల మండలం

ఏడాది నుంచి కోరుతున్నా..



నా భర్త చనిపోయి ఏడాది అవుతోంది. నాకు వితంతు పింఛను ఇవ్వాలని ఏడాది నుంచి కోరుతున్నా. సచివాలయానికి వెళ్తే ఇప్పుడు కొత్త పింఛన్లు ఇవ్వడం లేదు తర్వాత చూద్దామని పంపేశారు. కూలి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించే పెద్ద దిక్కును కోల్పోయాను. నాకు ఆరోగ్యం బాగాలేదు. పనుల్లోకి వెళ్లలేకపోతున్నా. పిల్లల్ని బడిలోకి పంపుతున్నాను. అమ్మఒడి ఇవ్వడం లేదు. వాళ్లని మాన్పించేసి కూలి పనులకు పంపడం ఇష్టంలేక నేనే కష్టపడుతున్నాను. ఏడాది నుంచి పింఛను మంజూరు కోసం సచివాలయం చుట్టూ తిరుగుతున్నాను.

– రావి సత్యవతి, మూలపర, నక్కపల్లి మండలం



నాడు: ఆస్పత్రిలో ఉన్నా లబ్ధిదారుడి వద్దకే వచ్చి పింఛను అందజేస్తున్న వలంటీర్



నేడు: వీధిలో ఒక చోటే నలుగురైదుగురికి పింఛన్ల పంపిణీ

న్యూస్‌రీల్

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

- కలెక్టర్ విజయ కృష్ణన్



అల్లూరి సమాధికి జ్యోతి వెలిగిస్తున్న కలెక్టర్

గొలుగొండ: యోగాతోనే ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. మండలంలోని కృష్ణదేవిపేట గ్రామంలో సోమవారం ఉదయం ఆమె యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. నర్సీపట్నం, గొలుగొండ, నాతవరం, మాకవరపాలెం తదితర మండలాల నుంచి వచ్చిన ప్రజలు ఉదయం 7 నుంచి 8.15 గంటల వరకు యోగాసనాలు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థాయి యోగా గురువులు మండల స్థాయిలో శిక్షణ ఇస్తున్నారన్నారు. మండల స్థాయిలో శిక్షణ తీసుకున్న వారు గ్రామ స్థాయిలో నేర్పాలన్నారు. నర్సీపట్నం ఆర్డీవో వి.వి. రమణ, వైద్య, గ్రామ సచివాలయం, ఎంపీడీవో కార్యాలయ అధికారులు, సర్పంచ్ లోచల సుజాత పాల్గొన్నారు.

అల్లూరికి నివాళి : మన్యం వీరుడు అల్లూరి సమాధికి కలెక్టర్ విజయ కృష్ణన్ సోమవారం ఘన నివాళులర్పించారు. అల్లూరి పార్కులో యోగా కార్యక్రమంలో పాల్గొన్న ఆమె ముందుగా అల్లూరి, గంటం సమాధుల వద్ద జ్యోతి వెలిగించారు. ఇక్కడ సమాధుల వద్ద యోగా కార్యక్రమం నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు.

ఐటీఐల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్

నర్సీపట్నం: ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో ప్రవేశాలకు ఈనెల 5వ తేదీ నుంచి 10వ తేదీ వరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కన్వీనర్, ఐటీఐ ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసాచారి తెలిపారు. మొత్తం 456 మంది విద్యార్థులు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకున్నారని, అర్హులైన అభ్యర్థులకు మొబైల్ ఫోన్, ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం ఇచ్చామన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో కౌన్సెలింగ్‌కు నర్సీపట్నం ప్రభుత్వ ఐటీఐలో హాజరు కావాలన్నారు. 5వ తేదీన 1 నుంచి 149 ర్యాంకులు, 6న 150 నుంచి 300, 7న 301 నుంచి 456 ర్యాంకుల అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు.

అడ్వాన్స్‌డ్‌లో అదరగొట్టారు

విశాఖ విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు

ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)ల్లో ప్రవేశానికి నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్-2025 ఫలితాల్లో విశాఖ విద్యార్థులు అదరగొట్టారు. జాతీయ స్థాయిలో వివిధ కేటగిరీల్లో ఉత్తమ ర్యాంకులు సాధించారు. అందరితో శభాష్ అనిపించుకున్నారు. పక్కా ప్రణాళికతో చదివామని, అధ్యాపకుల సూచనలు, సలహాలు ఉపయోగపడ్డాయని విద్యార్థులు చెప్పారు. ఈ సందర్భంగా విజేతల నేపథ్యం, భవిష్యత్ లక్ష్యాల గురించి తెలుసుకుందాం.. -దాబాగార్డెన్స్/సీతంపేట/తగరపువలస

ప్రముఖ ఐఐటీలో చేరుతా..



మా నాన్న సురేష్ సుమార్ అనకాపల్లి జిల్లాలో ఏపీఈపీడీసీఎల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గాను, తల్లి వసుధ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నారు. అధ్యాపకులు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 510వ ర్యాంకు సాధించాను. దేశంలోనే అత్యుత్తమ ఐఐటీలో ఎలక్ట్రానిక్స్ లేదా కంప్యూటర్ సైన్స్ బ్రాంచ్‌లో చేరుతాను.

–కొడవటి శివమ్‌రామ్ ప్రత్యూష్, 510 ర్యాంకు,

రోజుకు 13 గంటలపాటు చదివా..



రోజుకు 13 గంటలపాటు చదివా. ప్రతి వారం వీక్లీ టెస్ట్‌లకు అటెండయ్యా. డౌట్స్‌ను అధ్యాపకులను అడిగి నివృత్తి చేసుకునేవాడిని. తండ్రి ప్రసాదరావు, తల్లి వీణ.. ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులు. అధ్యాపకులు, యాజమాన్యం, తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఈ ర్యాంకు సాధించా. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావాలనుకుంటున్నా.

–టి.మనోహర్, 116వ ర్యాంకు

చేపల వ్యాపారం చేస్తూ చదివించారు..



పదో తరగతి సింహాచలం గురుకుల పాఠశాలలో చదివి 588 మార్కులు సాధించాను. ఇంటర్ సీబీఎస్ఈలో 472/500 మార్కులు వచ్చాయి. మెయిన్స్‌లో 407వ ర్యాంకు, అడ్వాన్స్‌డ్‌లో 151వ ర్యాంకు వచ్చింది. నా తల్లిదండ్రులు అంజూరి శ్రీను, ఉమ మత్స్యకారులు. చేపల వ్యాపారం చేస్తూ చాలా కష్టపడి చదివించారు. ఖరగ్‌పూర్ లేదా ముంబయి ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ చదివి ఇంజనీర్ కావాలన్నది నా లక్ష్యం.

– అంజూరి తారక్‌రామ్, 151వ ర్యాంకు, పాండ్రంకి గ్రామం

పూర్ణ సాయికి 132వ ర్యాంక్



పూర్ణ సాయి యదు వంశీ

అనకాపల్లి టౌన్: జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఫలితాల్లో అనకాపల్లి నారాయణ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. సోమవారం విడుదల చేసిన ఈ ఫలితాల్లో ఆలిండియా ఓపెన్ కేటగిరీలో మామిడి పూర్ణసాయి 132వ ర్యాంక్ (ఓబీసీ కేటగిరీలో 18వ ర్యాంక్) సాధించాడు. బండారు యదు వంశీకి ఓపెన్ కేటగిరీలో 3,146 ర్యాంక్ దక్కింది. పూర్ణ సాయి తండ్రి శివనాగేశ్వరరావు ప్రైవేటు కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. తల్లి పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టేవారు.

డేవిడ్ జాన్సన్‌కు 1353వ ర్యాంకు



డేవిడ్ జాన్సన్

పాయకరావుపేట: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో శ్రీ ప్రకాష్ విద్యార్థి దేవి డేవిడ్ జాన్సన్ ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరీలో 1353వ ర్యాంకు సాధించాడని విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్ విజయ్ ప్రకాష్ తెలిపారు. డేవిడ్ జాన్సన్ మాట్లడుతూ స్పెషల్ కోచింగ్ ద్వారా తనను తీర్చిదిద్దిన అధ్యాపక బృందానికి కృతజ్ఞతలు తెలిపాడు. ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె.నరసింహారావు, ఉపాధ్యాయ బృందం, సహచర విద్యార్థులు అభినందించారు.

ఐసీడీఎస్ పీడీగా సూర్యలక్ష్మి



సాక్షి, అనకాపల్లి: జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పీడీగా ఎస్.సూర్యలక్ష్మి నియమితులయ్యారు. ప్రస్తుతం ఆమె అల్లూరి సీతారామరాజు జిల్లా పీడీగా పనిచేస్తున్నారు. అక్కడ నుంచి అనకాపల్లి ఐసీడీఎస్ పీడీగా బదిలీ అయ్యారు. సోమవారం మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కమిషనర్ ఎ.సూర్యకుమారి ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం అనకాపల్లి జిల్లా ఐసీడీఎస్ పీడీగా పనిచేస్తున్న అనంత లక్ష్మి దీర్ఘకాలిక సెలవులు పెట్టిన విషయం తెలిసిందే. అనకాపల్లి ఐసీడీఎస్ పీడీగా బదిలీపై వచ్చిన సూర్యలక్ష్మి గతంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో సీడీపీఓ (సిటీ చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్)గా పనిచేశారు. అదేవిధంగా మహిళా ప్రాంగణం సిటీ మేనేజర్‌గా కూడా సమర్థవంతంగా పని చేశారు. స్వయం ఉపాధికి అవసరమైన నైపుణ్యాభివృద్ధి శిక్షణ కల్పించే మహిళా ప్రాంగణం మేనేజర్‌గా పనిచేసి ఆమె ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు అందుకున్నారు.

వీడని రేషన్ కష్టాలు



అచ్యుతాపురం మండలం మోసయ్యపేట గ్రామంలో సర్వర్ పనిచేయక రేషన్ షాపు వద్ద వేచి ఉన్న ప్రజలు



02రిటిఖినాతవరంలో ఎండలో నెత్తిమీద సరకులు

అచ్యుతాపురం రూరల్/నాతవరం: రెండో రోజు కూడా జిల్లా ప్రజలను రేషన్ కష్టాలు వీడలేదు. మోసయ్యపేట గ్రామంలోని రేషన్ దుకాణంలో సర్వర్ సరిగా పనిచేయకపోవడంతో వినియోగదారులు సోమవారం గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. గత ప్రభుత్వంలో ఇంటి వద్దకే వచ్చి రేషన్ ఇచ్చేవారని, ప్రభుత్వం మారడంతో ఇక్కట్లు కొనితెచ్చుకున్నట్లు అయిందని రేషన్ వినియోగదారులు వాపోతున్నారు. నాతవరం మండలంలో సర్వర్ సమస్యతో డీలర్లతోపాటు లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సోమవారం ఉదయం నుంచి గంటల తరబడి నిరీక్షణే తప్ప వేలిముద్రలు పడటం లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పీజీఆర్ఎస్.. తూతూమంత్రం.! IIలో

భక్తుల ఇలవేల్పు.. మాడుగుల మోదకొండమ్మ

- నేటి జాతరకు ఘనంగా ఏర్పాట్లు
- భారీ ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు



నగలు, పూలతో మోదకొండమ్మ తల్లికి ప్రత్యేక అలంకరణ



మోదకొండమ్మ ఆలయానికి ఏర్పాటు చేసిన విద్యుత్ లైటింగ్

మాడుగుల: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ జాతరను మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. అమ్మవారి సతకంపట్టు వద్ద, ఆలయం వద్ద ఉదయం నుంచి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించనున్నారు. కళ్లు మిరిమిట్లు గొలిపే విధంగా భారీ విద్యుత్ సెట్టింగ్‌లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎన్‌టీఆర్ కళాక్షేత్రం వద్ద టీవీ కళాకారులతో ప్రదర్శనలు, సతకంపట్టు వద్ద చిత్ర కళా ప్రదర్శన, దసరా స్టేజిపై చింతామణి, గయోపాఖ్యానం నాటకాలు, గవర వీధిలో విజయవాడ కళాకారులతో డ్యాన్స్ కార్యక్రమం జరగనున్నాయి. సతకంపట్టు వద్ద కొలువైన అమ్మవారి ప్రతిరూపమైన ఘటాలను చిత్ర విచిత్రమైన నేల వేషాలు, భజనలు, కోలాటాల నడుమ ఆలయానికి చేర్చడంతో అమ్మవారి నెల రోజుల పండగ ముగుస్తుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు సోమవారంతో ముగిశాయి. క్రికెట్‌లో విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.1,25,000, ద్వితీయ బహుమతిగా రూ.80 వేలను మంగళవారం అందజేస్తారు.

క్లుప్తంగా

ఉమ్మడి విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శిగా కుమార్‌రాజు


కుమార్‌రాజును సత్కరిస్తున్న గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం

దాబాగార్డెన్స్: శ్రీకాకుళం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శిగా పనిచేసిన బుర్రి కుమార్‌రాజు సోమవారం ఉమ్మడి విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం ఆయనను ఘనంగా సత్కరించింది. ఉద్యోగుల సంక్షేమానికి సహకరించాలని సంఘం ప్రతినిధులు ఈ సందర్భంగా కుమార్‌రాజును కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులతో పాటు కార్యవర్గ సభ్యులు, జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.

పోలీసులను ఆశ్రయిస్తున్న చిట్టీల బాధితులు

మాకవరపాలెం: చిట్టీల వ్యాపారి మృతితో నష్టపోయిన బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. మండల కేంద్రంలో 35 ఏళ్లుగా నివాసం ఉంటున్న చిట్టీల వ్యాపారి గొలుగూరి వెంకటరామారెడ్డి ఫిబ్రవరి 20న మృతి చెందిన సంగతి తెలిసిందే. అయితే మండలంలో వారే కాకుండా ఇతర ప్రాంతాలకు చెందిన సుమారు 400 మంది వరకు రామారెడ్డి వద్ద రూ.లక్షల్లో చిట్టీలు కట్టారు. ఆయన మృతి చెందడంతో చిట్టీలు కట్టిన వారే కాకుండా నోట్లు రాయించి రూ. లక్షల్లో నగదును ఇచ్చిన వారంతా తీవ్రంగా నష్టపోయారు. ఇప్పటికే కొందరు కోర్టును ఆశ్రయించారు. మరికొందరు ఒక్కొక్కరిగా పోలీసులకు ఫిర్యాదులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో ఎస్పీకి ఫిర్యాదు చేసినట్టు పి.పి.అగ్రహారం గ్రామానికి చెందిన బొంతు రమణ తెలిపారు. రామారెడ్డి కుటుంబ సభ్యులను విచారించి, బాధితులకు న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

పెదమదీనలో ఇల్లు దగ్ధం

బుచ్చెయ్యపేట: పెదమదీన గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఓ ఇల్లు దగ్ధమైంది. సుమారు రూ.2 లక్షల ఆస్తి నష్టం జరిగింది. గ్రామానికి చెందిన వియ్యపు నాయుడు, చిన్నమ్మలు పొట్టకూటి కోసం అనకాపల్లి పరిసర ప్రాంతాలకు వలస వెళ్లిపోయారు. సోమవారం వారి ఇల్లు కాలిపోయింది. గుర్తు తెలియని వ్యక్తులు కాల్చిపారేసిన సిగరెట్టు కారణంగా ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చని గ్రామస్తులు భావిస్తున్నారు. ఇంట్లో ఉన్న తిండి గింజలు, దుస్తులు, పలు వస్తువులు కాలిపోవడంతో బాధితులు భోరున విలపిస్తున్నారు. పొట్ట కూటి కోసం గ్రామం విడిచి వెళ్లగా అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయి సర్వం కోల్పోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు. మాజీ సర్పంచ్ వియ్యపు అప్పారావు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పరిహారం అందించి ఆదుకోవాలని తహసీల్దార్ లక్ష్మిని ఆయన కోరారు.

రూ. 3 వేల కోట్ల టర్నోవర్ లక్ష్యం

- డీసీసీబీ చైర్మన్ తాతారావు

విశాఖ విద్య: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ద్వారా 2025–26 ఆర్థిక సంవత్సరంలో రూ.3 వేల కోట్లు టర్నోవర్ లక్ష్యంగా పనిచేస్తామని బ్యాంకు చైర్మన్ కోనా తాతారావు అన్నారు. మద్రిపాలెంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. బ్యాంకు సీఈవో డీవీఎస్ వర్మ ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా తాతారావు మాట్లాడుతూ డీసీసీబీకి అనుసంధానంగా ఉన్న సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ప్రమాణస్వీకారం చేసిన తాతారావుకు విశాఖ, అనకాపల్లి ఎంపీలు శ్రీభరత్, సీఎం రమేష్, ఎమ్మెల్యేలు గణబాబు, కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేష్‌బాబు, బండారు సత్యనారాయణ తదితరులు అభినందనలు తెలిపారు.

పీజీఆర్ఎస్.. తూతూమంత్రం.!

- అర్జీల స్వీకరణ సరే.. పరిష్కారమెప్పుడు?
- ఆవేదన వ్యక్తం చేస్తున్న అర్జీదారులు
- కలెక్టరేట్‌లో అడుగడుగునా ఆంక్షలు

తుమ్మపాల: కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యలు పరిష్కార వ్యవస్థ కార్యక్రమం తూతూమంత్రంగా సాగుతోంది. కలెక్టరేట్‌కు వస్తే సమస్యను జిల్లా అధికారులు విని తక్షణమే కింది స్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ పరిష్కరిస్తారన్న ఆశతోనే జిల్లా నలుమూలల నుంచి వ్యయ ప్రయాసలకోర్చి మండుటెండను సైతం లెక్కచేయకుండా వస్తున్న అర్జీదారులకు నిరాశే మిగులుతోంది. జిల్లా అధికారులు సైతం అర్జీ తీసుకుని.. సరే వెళ్లండి అంటున్నారని పలువురు అర్జీదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు ప్రమాదాల్లో గాయాలపాలైన బాధితులు, సంక్షేమ పథకాల కోసం కుటుంబ సభ్యుల సహాయంతో వచ్చిన వృద్ధులు, దివ్యాంగుల పరిస్థితి మరీ దయనీయంగా ఉంటోంది. వీరిని గేటు వరకు మాత్రమే సిబ్బంది అనుమతి ఇస్తున్నారు. మరికొందరు తమ చిన్నారులను తీసుకుని వచ్చినప్పటికి పీజీఆర్ఎస్ వేదిక వద్దకు ఒక్కరికే అనుమతి అంటూ మిగిలిన వారిని బయటకు పంపించేస్తున్నారు. కలెక్టరేట్ బయట రోడ్డు నుంచి అర్జీదారులు బారికేడ్లు దాటుకుని ప్రధాన గేటు వద్దకు రాగా పోలీసులు అర్జీదారుల సంచుల్లో సామగ్రిని తనిఖీ చేసి ఒక్కరినే అనుమతిస్తున్నారు. అడుగడుగున తనిఖీలతో


అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

అడ్డంకులు పెట్టి మరి అర్జీదారులను కలెక్టరేట్‌లోకి పంపిస్తున్నా అధికారుల నుంచి సానుకూల స్పందన లేకపోవడంతో అర్జీదారులంతా నిరాశతోనే వెనుతిరుగుతున్నారు.

265 అర్జీల స్వీకరణ

కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్ విజయ కృష్ణన్‌తో పాటు డీఆర్వో వై.సత్యనారాయణరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుబ్బలక్ష్మి అర్జీలు స్వీకరించారు. సమస్యలు పరిష్కారంలో అధికారుల చొరవ చూపకపోవడం వల్లనే అర్జీలు రీఓపెన్ అవుతున్నాయని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అర్జీల విచారణలో అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కారం చేయాలని, పరిష్కరించలేని అర్జీల విషయంలో అర్జీదారులకు స్పష్టత ఇవ్వాలన్నారు. మొత్తం 265 అర్జీలు నమోదయ్యాయి.

భూకబ్జాదారులకు ఎమ్మెల్యే రాజు అండ


యడ్ల చినసత్తిబాబు

ప్రభుత్వ భూములను ఫోర్జరీ దస్త్రాలతో రూ.4 కోట్లకు విక్రయించేయడంతో పాటు మరో 70 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించిన ముఠాపై విచారణ చేపట్టాలని రావికమతం మండలం తోటకూరపాలెం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త యడ్ల చినసత్తిబాబు పీజీఆర్ఎస్‌లో జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. అచ్యుతాపురం మండలం నునపర్తి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తనకున్న పలుకుబడితో ప్రభుత్వ భూములను బినామీల పేరున తప్పుడు పాసు పుస్తకాలు తయారు చేసి భూకబ్జాలను పాల్పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రశ్నించిన తనతో పాటు కుటుంబ సభ్యులపై పోలీసు కేసులు పెట్టారని ఆరోపించారు. ఈ విషయాన్ని హోంమంత్రి అనిత, చోడవరం ఎమ్మెల్యే రాజుకు చెప్పినా వారు పట్టించుకోకుండా.. ఆక్రమణదారులకు అండగా నిలుస్తున్నారని, వారి ఆదేశాలతోనే తనపై కేసులు నమోదయ్యాయన్నారు. గ్రామంలో సర్వే నంబర్ 3లో ప్రైవేటు భూమితో పాటు సర్వే నంబర్ 2, 4లో ప్రభుత్వ భూమి 30 ఎకరాలు, కోటకోట మండలం అడ్డాం గ్రామంలో కూడా 40 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

మౌలిక వసతుల కోసం వినతి


మారెడ్ల అప్పలరాజు

గత ప్రభుత్వంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకంలో నిర్మించుకున్న ఇళ్లకు మంచినీరు, రోడ్లు వంటి మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరుతూ యలమంచిలి మండలం మర్రిబంధలో నివాసముంటున్న కాలనీ వాసి మారెడ్ల అప్పలరాజు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో ఇల్లు కట్టుకుని గడిచిన మూడేళ్లుగా నివాసముంటున్న తమకు మంచినీరు, రోడ్లు, తదితర సౌకర్యాలు లేవని వాపోయారు. రాకపోకలకు నానా అవస్థలు పడుతున్నామని చెప్పారు. తాగునీటి కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని వివరించారు. ఇప్పటికే చాలా సార్లు అధికారులకు తమ సమస్యలను విన్నవించుకున్నా పరిష్కారానికి నోచుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి పన్నులు కూడా పంచాయతీ సిబ్బంది వసూలు చేయడం లేదని, కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలని ఆయన కోరారు.

పరిహారం ఇచ్చి ఆదుకోండి..


వేములపూడి వరహాలు

భవన నిర్మాణ కాంట్రాక్టర్ నుంచి నష్ట పరిహారం ఇప్పించాలని కోరుతూ నక్కపల్లి మండలం చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన తాపీమేస్త్రి వేములపూడి వరహాలు కోరారు. చేతికర్ర సాయంతో కలెక్టరేట్‌కు చేరుకున్న ఆయన అధికారులకు తన గోడు వినిపించుకున్నాడు. విరోదిలు చిన్నా అనే కాంట్రాక్టర్ వద్ద పని చేస్తూ జనవరిలో రెండో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు కింద పడి గాయాలపాలయ్యానని, ప్రస్తుతం నడవలేని స్థితిలో ఉన్నప్పటికి కాంట్రాక్టర్, భవన యాజమాని గానీ పట్టించుకోలేదని ఆయన ఆరోపించాడు. ఏప్రిల్‌లో కలెక్టరేట్‌కు వచ్చి ఫిర్యాదు చేశానని, ప్రయోజనం లేకపోవడంతో మళ్లీ కలెక్టర్‌ను కలిసి తన బాధను చెప్పుకుందామని వస్తే.. కిందనే సమస్య అడిగి పంపిచేస్తున్నారని వాపోయారు. తనకు న్యాయం చేయాలని కోరారు.

జగనన్న ఇంటి పట్టాను విక్రయించేశారు


దూడ నూకమ్మ

జగనన్న కాలనీలో ఇచ్చిన పట్టాను తనకు తెలియకుండా విక్రయించేసి మరో చోట పట్టా ఇస్తానంటూ మోసం చేసిన సచివాలయం, తహసీల్దార్ కార్యాలయం అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తుమ్మపాల కొత్తపేట వీధికి చెందిన దూడ నూకమ్మ పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసింది. తనకు మారేడుపూడి గ్రామం సర్వే 205లో ప్లాట్ నెం.13 స్థలం మంజూరు చేసి జియోటాగింగ్ కూడా చేశారని, ఇల్లు కట్టడం ఆలస్యమైనందున నా స్థలాన్ని గ్రామ నాయకులు ఇతరులకు విక్రయించేసి అన్యాయం చేశారని వాపోయింది. అధికారులు విచారణ చేపట్టి తన స్థలంలో ఇల్లు కట్టుకునేలా చేయాలని వేడుకుంది.

ఎస్పీ కార్యాలయాలనికి 30 అర్జీలు


అర్జీదారుల సమస్యను వింటున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: ఎస్పీ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 30 అర్జీలు అందాయి. ఎస్పీ తుహిన్ సిన్హా అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించి, వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ చట్ట పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఆస్తి తగాదాలు, కుటుంబ వివాదాలు, చీటింగ్ వంటి వాటిపై అర్జీలు వచ్చినట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహనరావు, ఎస్ఐ డి.వెంకన్న, అర్జీదారులు, తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా కృషి చేస్తే క్షయ రహిత జిల్లా

'ఇంటెన్సిఫైడ్ టీబీ క్యాంపెయిన్ – టీబీ ముక్త్ భారత్ అభియాన్' పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, డీఎంహెచ్‌వో బాలాజీ

తుమ్మపాల: క్షయ రహిత జిల్లాగా మార్చేందుకు కలిసికట్టుగా కృషి చేద్దామని కలెక్టర్ విజయ కృష్ణన్ పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబరులో ''ఇంటెన్సిఫైడ్ టీబీ క్యాంపెయిన్ – టీబీ ముక్త్ భారత్ అభియాన్–2025' పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ ప్రోగ్రాం కింద ఎవరైనా టీబీ వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకొని ''నిక్షయ్ మిత్ర'గా రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సిందిగా కోరారు. ఈ నెల 4న గ్రామ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ నుంచి జిల్లా స్థాయి వరకు టి.బి. పరీక్షలు చేయించాలన్నారు. కళ్లె పరీక్ష చేయడం, వ్యాధి లక్షణాలు లేని వ్యక్తులకు ఎక్స్‌రే ద్వారా వ్యాధిని గుర్తించవచ్చన్నారు. వ్యాధి నిర్ధారణ చేసుకుని, క్షయ వ్యాధి లేని దేశంగా తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొనాలని ఆదేశించారు. చివరిగా క్షయ వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం తదితర సమాచారంతో కూడిన గోడపత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.ఎస్.వి.కె. బాలాజీ, డాక్టర్ సి.హెచ్. ధాత్రీప్రియ, వైద్యాధికారి ఎల్. శ్రావణ తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఆ నలుగుర్నీ అరెస్ట్ చేయాలి

- మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ డిమాండ్
- సీసీ ఫుటేజీలు బయటపెట్టాలి


సీఐ గోవిందరావుతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: వైఎస్సార్‌సీపీ యూత్ అధ్యక్షుడు అల్లంపల్లి ఈశ్వరరావుపై హత్యాయత్నంకు పాల్పడిన మరో నలుగురిని తక్షణమే అరెస్టు చేయాలని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం టౌన్ సీఐ గోవిందరావును పార్టీ నాయకులతో కలిసి ఆయన విజ్ఞప్తి చేశారు. రౌడీ షీటర్ పప్పల అప్పలనాయుడు, మరో ఐదురుగు రెండు బైక్‌లపై వచ్చి హత్యాయత్నంకు పాల్పడ్డారన్నారు. వారందరినీ అరెస్టు చేయకుండా రౌటీషీటర్, మరో వ్యక్తిని అరెస్టు చేసి కేసును నీరుగార్చే పని చేయవద్దన్నారు. కత్తులు, రాడ్లతో ఈశ్వరరావును వెంబడించారని సీఐ దృష్టికి తీసుకెళ్లారు. పాల్‌ఘాట్ జంక్షన్ నుంచి అబిద్ సెంటర్ వరకు జరిగిన సంఘటన వాస్తవాలు బయటకు రావాలంటే సీసీ ఫుటేజీలను పరిశీలించాలన్నారు. సంఘటన ప్రారంభమైన సీసీ ఫుటేజీ ఆధారంగా ఇద్దరిపై కేసు పెట్టి సరిపెట్టాలనుకోవడం సరికాదని సీఐకు సూచించారు. అబిద్ సెంటర్‌లోని సీసీ ఫుటేజీలను కూడా పరిశీలిస్తే మిగతా నిందితులు దొరుకుతారన్నారు. ఆ ఇద్దరుతో పాటు ఆ నలుగురిని కూడా అరెస్ట్ చేయాలని ప్రధానంగా డిమాండ్ చేస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్యే వెంట మున్సిపల్ వైస్‌చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, టౌన్ పార్టీ అధ్యక్షుడు ఏకా శివ, పార్టీ లీగల్‌సెల్ ప్రతినిధులు మాకిరెడ్డి బుల్లిదొర, కౌన్సిలర్ సిరసపల్లి నాని, ఆరుగుల్ల రాజుబాబు, దాడి బుజ్జి తదితరులు ఉన్నారు.

ట్రావెల్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

మల్కాపురం : హెచ్‌పీసీఎల్ సీ గేటు సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. మల్కాపురం సీఐ గొలగాని అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం.. అనకాపల్లి గవరపాలేనికి చెందిన నారాయణరావు (30), రామ్మూర్తి విగ్రహాల తయారీదారులు. మల్కాపురంలో విగ్రహం ఏర్పాటుకు స్థల పరిశీలన నిమిత్తం ద్విచక్ర వాహనంపై ఇక్కడికి వచ్చారు. మధ్యాహ్నం భోజనం కోసం మల్కాపురం నుంచి శ్రీహరిపురం వెళ్తుండగా, వెనుక నుంచి వేగంగా వచ్చిన ఓ ట్రావెల్స్ బస్సు వారి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం వెనుక కూర్చున్న నారాయణరావు తలపై నుంచి బస్సు టైరు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనం నడుపుతున్న రామ్మూర్తికి కుడి కాలికి తీవ్ర గాయం కావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ అప్పారావు తెలిపారు.

టెన్త్ టాపర్ వర్షిణికి వాసవీ వనితా క్లబ్ సత్కారం


టాపర్ వర్షిణిని సత్కరిస్తున్న వాసవీ వనిత క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ నాగజ్యోతి, నాయకులు

రోలుగుంట: పదో తరగతి మండల టాపర్ అయిన అదపురెడ్డి వర్షినిని వాసవీ వనిత క్లబ్ చార్టర్ ప్రెసిడెంటు నాగజ్యోతి తదితరులు సోమవారం ఘనంగా సత్కరించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు భవన్ నిర్మాత పిరాట్ల నర్సింహం, వాసవీ క్లబ్, వాసవీ వనిత క్లబ్ సంయుక్తంగా జిల్లాస్థాయిలో మండల టాపర్లు అయిన అధిక మార్కులు సాధించిన పదో తరగతి విద్యార్థులకు అనకాపల్లి ప్రభుత్వ పాఠశాలలో అభినందన సత్కార కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక మార్కులు సాధించి 11 మండలాల నుంచి పాల్గొన్న టాపర్స్‌కి జ్ఞాపికలు, బహుమతులు అందజేసి ఘనంగా సత్కరించారు. వర్షిణి రోలుగుంట కేజీబీవీలో చదివి 570 మార్కులు సాధించింది. ఈ కార్యక్రమం నిర్వహణలో భాగస్వామి, రోలుగుంట జెడ్పీ ఉన్నత పాఠశాల ఇంగ్లిష్ టీచర్, వాసవీ వనిత క్లబ్ చార్టర్ ప్రెసెడెంటు నాగజ్యోతి మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నత స్థితికి ఉపాధ్యాయుల సమష్టి కృషి, విద్యార్థుల తల్లిదండ్రుల కృషి కూడా ఎంతో దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి ఓరుగంటి నాగమణి, టీడీపీ అనకాపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పచ్చికూర రాము, జనసేన నూకాంబిక దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీ, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇద్దరు దొంగల అరెస్ట్


నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఎస్ఐ శ్రీనివాసరావు

బుచ్చెయ్యపేట: బుచ్చెయ్యపేట మండలంలో ఐయితంపూడి గ్రామంలో రెండు ఇళ్లల్లో దొంగతనానికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి, సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. ఐయితంపూడి గ్రామానికి చెందిన ముచ్చకర్ల బొర్రయ్య, పెదిరెడ్ల రాజు తమ ఇళ్లకు తాళాలు వేసి ఇతర గ్రామాలకు కూలీ పనులకు వలస వెళ్లగా.. గతంలో దొంగతనాలు జరిగాయన్నారు. బంగారం, వెండి వస్తువులు, నగదు పట్టుకుపోవడంతో అప్పట్లో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టామన్నారు. ఇదే గ్రామానికి చెందిన ఐయితరెడ్డి శివకుమార్, ముచ్చకర్ల కృష్ణమూర్తి వ్యసనాలకు బానిసై తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్‌గా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలిందన్నారు. రెండు ఇళ్లల్లో జరిగిన దొంగతనాలు జరిగిన ప్రదేశాల్లో వేలిముద్రలు, వారి కదలికలు ఆధారంగా నిందితులను పట్టుకుని విచారణ చేయగా దొంగతనంకు పాల్పడినట్లు ఒప్పుకున్నారన్నారు. వారి వద్ద నుంచి మూడు తులాలు బంగారు ఆభరణాలు, 10 తులాలు వెండి వస్తువులు, రూ.15 వేలు నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను సోమవారం చోడవరం కోర్టులో హాజరు పరిచామన్నారు. చోరీ కేసులను ఛేదించిన అదనపు ఎస్ఐ భాస్కరరావు, హెడ్ కానిస్టేబుల్ అర్జున్, కానిస్టేబుళ్లు గణేష్, వెంకట్, హరీష్, కిరణ్, హోంగార్డులు నాగేష్, కనకరాజులను సీఐ కోటేశ్వరరావు అభినందించారు.

సహజ సంపద దోపిడీకే 'ఆపరేషన్ కగార్'



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యన్నారాయణ మూర్తి

అనకాపల్లి టౌన్: ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం అమాయక ఆదివాసి గిరిజనులను బలి తీసుకుంటుందని, ఏజెన్సీ ప్రాంతాల నుంచి గిరిజనులను తరిమి కొట్టి అక్కడ ఉండే సహజ సంపదను దోచుకోవడానికి ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి ధ్వజమెత్తారు. స్థానిక రోటరీ కల్యాణ మండపంలో ఆపరేషన్ కగార్ లోగుట్టు అనే అంశంపై సదస్సు సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మావోయిస్టుల ఏరివేత పేరుతో నడుస్తున్న ఈ ఆపరేషన్ వెనుక అటవీ సంపదలను కార్పొరేట్‌లకు కట్టబెట్టడమే ప్రధాన లక్ష్యంగా ఉందని ఆరోపించారు. ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మధ్యప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలలో విస్తరించిన దండకారణ్యంలో ఇనుము, సున్నపు రాయి, బాక్సైట్, డోలమైట్, సహా విలువైన ఖనిజాలను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేయడానికి, అక్కడ ఉన్న ప్రజలను అడ్డుతొలగించడానికి మావోయిస్టుల అంతం పేరుతో ఆపరేషన్ కగార్ చేపట్టినట్లు ఆరోపించారు. 2005లో సల్వాజుడం, 2009లో ఆపరేషన్ గ్రీన్ హంట్ చేపట్టాయని, దానికొనసాగింపే ఆపరేషన్ కగార్ అని తెలిపారు. ఈ సమావేశంలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకుడు వి.ఎస్.కృష్ణ, ఏపీ ఆదివాసీ సంఘం గౌరవ అధ్యక్షుడు అజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

అనకాపల్లి: వైఎస్సార్ కడప స్పోర్ట్స్ స్కూల్‌లో 2025–26 విద్యా సంవత్సరానికిగాను క్రీడా కోటాలో ప్రవేశాలకు 4, 5 తరగతుల విద్యార్థులు ఈ నెల 25వ తేదీలోగా ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి ఎల్.వి.రమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశాలు పొందే వారికి ఉచిత భోజనం, విద్య, వసతి, క్రీడా సౌకర్యాలు ఉంటాయన్నారు. 4వ తరగతి విద్యార్థులు 2015 ఏప్రిల్ 1 నుంచి 2017 మార్చి 31వ తేదీలోపు జన్మించి ఉండాలన్నారు. ఒకటి నుంచి మూడో తరగతి వరకు ప్రభుత్వ గుర్తింపు పొందిన స్టడీ సర్టిఫికెట్, జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డులు ఉండాలన్నారు. 5వ తరగతిలో చేరే వారు 2014 ఏప్రిల్ 1 నుంచి 2016 మార్చి 31వ తేదీలోపు జన్మించి ఉండాలన్నారు. 1 నుంచి 4వ తరగతి వరకు ప్రభుత్వ గుర్తింపు పొందిన స్టడీ సర్టిఫికెట్‌ను తప్పనిసరిగా ఆన్‌లైన్లో నమోదు చేసుకోవాలన్నారు. స్క్రీనింగ్, షార్ట్ లిస్ట్ చేసిన పిదప విడుదల చేసిన జాబితా ప్రకారం జూలై 1 నుంచి 3వ తేదీ వరకూ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి సమక్షంలో ఒరిజినల్ సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేసుకోవాలన్నారు. ఎంపికైన విద్యార్థులు జూలై 10, 11 తేదీల్లో రాష్ట్ర స్థాయి ఎంపికకు హాజరుకావాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9963177814ను సంప్రదించాలని కోరారు.

ఐఐఎంవీలో పీజీ ప్రోగ్రాం ప్రారంభం

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నం)లో రెండేళ్లపాటు కొనసాగే పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాం ఇన్ మేనేజ్‌మెంట్ కోర్సు సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఐఐఎంవీ డైరెక్టర్ ఎం. చంద్రశేఖర్ ప్రారంభ ఉపన్యాసంలో మాట్లాడుతూ.. దేశంలోని అగ్రశ్రేణి సాంకేతిక సంస్థల నిపుణుల కోసం ప్రత్యేక నాయకత్వ సామర్థ్యాన్ని పెంపొందించడానికి, కొత్త తరం టెక్నో మేనేజర్‌లను సృష్టించడానికి ఈ కోర్సును రూపొందించినట్లు తెలిపారు. ఈ కోర్సులో పాల్గొనే విద్యార్థులు మొదటి ఏడాది చివరిలో మేనేజ్‌మెంట్‌లో డిప్లమో పొందవచ్చని, ఎంబీఏ డిగ్రీ కోసం రెండో ఏడాది కూడా కొనసాగవచ్చని ఆయన వివరించారు. ఈ బ్యాచ్‌లో మొత్తం 72 మంది విద్యార్థులుండగా, 62 మంది రెండో సంవత్సరం కూడా కొనసాగడానికి ఆసక్తి చూపినట్లు చంద్రశేఖర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం చైర్ ప్రొఫెసర్ షమీమ్ పాల్గొన్నారు.

12 నుంచి స్టూడెంట్ బస్సు పాసుల జారీ

అనకాపల్లి: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు ఈ నెల 12 నుంచి ప్రారంభం కానుండడంతో విద్యార్థులకు బస్సు పాసుల జారీకి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లాలో అనకాపల్లి, నర్సీపట్నం డిపో కాంప్లెక్స్ ఆవరణలో బస్ పాసు కౌంటర్లు ఈ నెల 12 నుంచి ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటాయని జిల్లా ప్రజారవాణా శాఖ అధికారి కె.పద్మవతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ముందుగా టీటీటీ.్ఞఐఖఆఛిఛ్ఛిఞఞటట జీ వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలను నమోదు చేసిన తరువాత ఫొటోతో పాటు ఆన్‌లైన్ అప్లికేషన్ తీసుకురావాలని పేర్కొన్నారు. ఆ అప్లికేషన్‌పై తమ విద్యా సంస్థ ప్రిన్సిపాల్/ప్రధానోపాధ్యాయుడితో ధ్రువీకరణ చేయించి సంబంధిత డిపో కార్యాలయానికి వెళ్లాలని, అప్లికేషన్, ఆధార్, పదో తరగతి పాసైన విద్యార్థులు అయినచో మార్కు లిస్టు జెరాక్సు కాపీ తప్పక జతపరచాలని సూచించారు. అప్లికేషన్‌లో ఫోన్ నెంబరు తప్పక రాయాలన్నారు.

విద్యా సంస్థలకు సూచనలు

అడ్మిషన్ లిస్టు తరగతుల వారీగా ప్రిన్సిపాల్/ప్రధానోపాధ్యాయుడు సంతకంతో సంబంధిత డిపో మేనేజరు కార్యాలయానికి అందజేయాలని ఆమె సూచించారు. అలా చేయని విద్యా సంస్థల విద్యార్థులకు పాసులు జారీ చేసేది లేదని స్పష్టం చేశారు. 12 సంవత్సరాల లోపు బాలురు, 18 సంవత్సరాల లోపు బాలికలు(10వ తరగతి వరకు) ఉచిత బస్సు పాస్, స్టూడెంటు జనరల్ బస్ పాస్ (సంవత్సరం), స్టూడెంటు జనరల్ బస్ పాస్ (మూడు నెలలు), స్టూడెంటు జనరల్ బస్ పాస్ (నెల) లను కౌంటర్లలో నేరుగా బస్సుపాస్ పొందవచ్చునన్నారు.

క్లుప్తంగా

అన్ని రంగాల్లో యువత ముందుండాలి

అనకాపల్లి టౌన్: యువత అన్ని రంగాలలో ముందు ఉండాలని ఏపీ, తెలంగాణ రాష్ట్రాల విశ్వహిందూ పరిషత్ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్థానిక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో యువతుల విభాగం రాష్ట్ర స్థాయి శౌర్య ప్రశిక్షణవర్గ దుర్గా వాహిని ముగింపు కార్యక్రమం సోమవారం జరిగింది. వారం రోజుల నుంచి జరుగుతున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. జీవితంలో ఎదురయ్యే సమస్యల పట్ల స్పష్టమైన అవగాహనతో కార్యాచరణతో ముందుకు వెళ్లాలన్నారు. ధర్మ సంస్థాపన, ధర్మ పరిరక్షణ కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నుదురుపాటి తాతాజీ, శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూడు మట్టి లోడ్ లారీల పట్టివేత

అనకాపల్లి టౌన్: మండలంలోని కోడూరు గ్రామంలో అక్రమంగా మట్టి తరలిస్తున్న మూడు లారీలను సోమవారం పట్టుకున్నట్లు రూరల్ ఎస్ఐ రవికుమార్ తెలిపారు. గ్రామంలోని ఎటువంటి అనుమతులు లేకుండా సమీపంలోని చెరువులోంచి మట్టిని తరలిస్తున్నారన్న సమాచారంతో వాటిని సీజ్ చేసి మైన్స్ శాఖకు అప్పగించామన్నారు.

ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు


ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేస్తున్న నిర్వాహకులు

అనకాపల్లి టౌన్: విద్యార్థులు ఇష్టపడి చదవాలని, అప్పుడే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని మార్కెట్ కమిటీ చైర్మన్ పచ్చికూర రాము తెలిపారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు పాట్టి శ్రీరాములు భవన నిర్మాణ నిర్వాహకుడు పిరాట్ల నరసింహమూర్తి ఆధ్వర్యంలో ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ ప్రతినిధులు, నూకాంబిక ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ పీలా నాగశ్రీను, బీజేపీ జిల్లా కార్యదర్శి ఓరుగంటి నాగమణి, ప్రోగ్రాం చైర్మన్ గంగుపాం నాగేశ్వరరావు, ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్, పీఎస్ నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

6న చిన్నారులకు అక్షరాభ్యాసం

అనకాపల్లి: మండలంలో బట్లపూడి పంచాయతీ నాయుడుపేటలో హరహర మహాదేవ శంభో శంకర ఆలయంలో ఈ నెల 6న పౌర్ణమి సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రతినిధి శివ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఆంజనేయ స్వామి గుడి వెనుక కొండపైన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

బెల్లం ధరలు

అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 283 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,100	4,900
రెండో రకం	3,590	4,400
మూడో రకం	3,250	3,500

అనకాపల్లి సినిమాలు

భైరవం	:రాజా
ఖలేజా	:సత్యనారాయణస్క్రీన్-1
కరాటే కిడ్-లిజెండ్స్	: సత్యనారాయణ స్క్రీన్-2
ఖలేజా	:పర్తిసాయి
సింగిల్	:షిర్డీసాయి
ఏసీఈ	:వెంకటేశ్వర
శుభం	:శ్రీసత్య
షష్టిపూర్తి	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 80 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్ 24 యూనిట్లు, బీ పాజిటివ్ -12, ఓ పాజిటివ్ -36, ఏబీ పాజిటివ్ -8 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ యు. లోకేష్‌ను 9703619706 సంప్రదించాలని కోరారు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 387 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 325 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595ను సంప్రదించవచ్చు.

దారి తప్పిన పాలన

- అధికారంలోకి వచ్చి ఏడాదైనా గోతుల రోడ్లను బాగు చేయలేదు
- వాహనదారులకు ఇక్కట్లు


మార్టూరు గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి


మామిడిపాలెం జంక్షన్ వద్ద రాళ్లు తేలిన రహదారి

అనకాపల్లి టౌన్: మండలంలో ఏ దారి చూసినా గోదారి తప్పదన్నట్టుగా గోతులతో వెక్కిరిస్తున్నాయి. అనకాపల్లి నుంచి చోడవరం వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు గోతులమయంగా మారింది. తుమ్మపాల నుంచి మార్టూరు, దర్జీనగర్, ఊడేరు, మామిడిపాలెం, వెంకన్నపాలెం వరకు కొన్ని చోట్ల రోడ్డు మొత్తం ధ్వంసమైంది. పెద్ద గోతులు ఏర్పడి వర్షం వస్తే నీరు నిలిచిపోయి ఏది గొయ్యో తెలియక ప్రమాదాలు బారిన పడుతున్నారు. మరి కొన్ని చోట్ల తారుపైకి లేచిపోయి కంకర తేలిపోయి ప్రమాదకరంగా మారింది. వాటి మీదే నిత్యం అనకాపల్లికి పాడేరు, మాడుగుల, చోడవరం నియోజకవర్గాల నుంచి వివిధ పనుల మీద రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. అదేవిధంగా మండలంలోని క్వారీ, క్రషర్ల నుంచి నిత్యం లారీలు రాకపోకలు సాగిస్తుండటంతో ఈ రోడ్డు మరింత దారుణంగా తయారైంది. బొజ్జన్నకొండకు వెళ్లే రహదారి సైతం గోతులమయంగా మారింది. ఈ రోడ్డులో పగలు అతికష్టం మీద ప్రయాణిస్తున్న ప్రజలు రాత్రివేళల్లో నరకాన్ని చూస్తున్నారు.

ఇటీవల వర్షాలకు గోతుల్లో నీరు నిలిచిపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రధానంగా రోడ్లను బాగు చేస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇంతవరకూ పట్టించుకున్న పాపాన పోలేదు. ఇప్పటికైనా రోడ్లను అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.


తుమ్మపాల యూనియన్ బ్యాంక్‌కు వెళ్లే రహదారి

గోతుల్లో పడిపోతున్నాం



తుమ్మపాల మెయిన్ రోడ్డు గోతులతో దారుణంగా తయారైంది. వివిధ పనులపై అనకాపల్లి వెళ్లి రావడానికి నానా అవస్థలు పడుతున్నాం. వర్షం కురిస్తే గోతుల్లో నీరు చేరి అందులో పడిపోతున్నాం. కుటుంబంతో వెళ్లాలంటే భయపడాల్సి వస్తోంది.

– బి రాజారావు, బట్లపూడి

ఒళ్లు హూనమవుతోంది



గోతుల్లో ప్రయాణించడం వల్ల ఒళ్లు హూనమవుతోంది. వెన్నుముక సమస్యలు అధికమవుతున్నాయి. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా, రోడ్లు వేయలేదు సరికదా.. కనీసం గోతులను పూడ్చడం లేదు.

– మహమ్మద్ ఆలీ రాజా, అనకాపల్లి


గుండాల జంక్షన్ వద్ద ఏర్పడిన భారీ గొయ్యి


తుమ్మపాల చినబాబు కాలనీ వద్ద గోతులతో చెరువును తలపిస్తున్న రహదారి

ఆటలతో మానసిక ఉల్లాసం


విద్యార్థులకు నిర్వహిస్తున్న ఆటల పోటీ

కశింకోట: వేసవి విజ్ఞాన శిబిరానికి విద్యార్థులు, చిన్నారుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఇందులో భాగంగా మండలంలోని తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి కె. జగన్నాథం మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆటలు ఆడటం వల్ల శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం, ఆరోగ్యం కలుగుతాయన్నారు. దీనిదృష్ట్యా ఆటలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జనరల్ నాలెడ్జ్ ప్రశ్నలపై కూడా అవగాహన కలిగించారు.

శివాలయంలో అభిషేకాలు

కశింకోట: స్థానిక శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. అర్చకులు వి. చిదంబరం, వి. కృష్ణల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

అన్ని పాఠశాలల్లో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం


మాట్లాడుతున్న శిష్టు ఖగేశ్వరరావు

అగనంపూడి: అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరిచుకొని ఈనెల 5న అన్ని ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, మోడల్ స్కూళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో కార్యక్రమాలు నిర్వహించాలని ఏపీఎన్‌జీసీ జిల్లా కోఆర్డినేటర్ శిష్టు ఖగేశ్వరరావు చెప్పారు. లంకెలపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆయా పాఠశాలల్లో మొక్కలు నాటడం, అవగాహన ర్యాలీలు నిర్వహించడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని ఆయన కోరారు. జీపీఎస్ మోడ్‌లో కార్యక్రమాల వివరాలు ఏపీఎన్‌జీసీ అనకాపల్లి గ్రూప్‌లో షేర్ చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో లంకెలపాలెం క్లస్టర్ హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు, ఏపీఎన్‌జీసీ క్లస్టర్ కో ఆర్డినేటర్ బి.అన్నాజీరావు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఒత్తిడిని తగ్గించండి

జిల్లా రవాణా శాఖ అధికారి మనోహర్


యోగాసనాలు చేస్తున్న జిల్లా రవాణా శాఖ అధికారి మనోహర్, తదితరులు

అనకాపల్లి: నిత్యం ప్రాణాయామం, ధ్యానం చెయ్యడం వల్ల ప్రయాణాల్లో వచ్చే మానసిక ఒత్తిడిని తగ్గించవచ్చని, వాహన డ్రైవర్లు విధిగా యోగా సాధన చేసినట్లయితే రోగాలు బారిన పడకుండా ప్రశాంతంగా జీవిస్తారని జిల్లా రవాణా శాఖ అధికారి జి. మనోహర్ తెలిపారు. యోగాంధ్ర -2025లో భాగంగా సోమవారం గవరపాలెం రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో యోగాసనాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు ఎక్కువ సమయం వాహనాల్లో గడిపే కారణంగా శారీరక, మానసిక ఒత్తిడికి గురవుతారని, అలాంటి పరిస్థితుల్లో యోగా అనేది ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. దీర్ఘకాలం కూర్చుని పనిచేసే డ్రైవర్లకు పీతం నొప్పులు, మడకలు, నరాల బలహీనత సమస్యలు ఏర్పడుతాయని, యోగా వీటికి సహాయ పడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ రోజూ విధిగా యోగ సాధన చేసినట్లయితే రోగాలు బారిన పడకుండా ప్రశాంతంగా జీవిస్తారన్నారు. నర్సీపట్నం ప్రాంతీయ రవాణా శాఖ అధికారి ఎస్ రమేష్ మాట్లాడుతూ రోజూ యోగా చేసినట్లయితే ఒత్తిడి నుంచి ఉపశమనం పొందుతారన్నారు. ఈ నెల 21న విశాఖపట్నంలో అంతర్జాతీయ యోగా దినోత్సవానికి అందరూ సమాయత్తం కావాలన్నారు. యోగా యాప్‌లో రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ప్రకాష్ రావు, రాజన్న, వెంకట రావు, పరిపాలన అధికారి బాల జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

8 గ్రామాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ


విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తున్న ఏపీఈపీడీసీఎల్ అధికారులు

కశింకోట: మండలంలోని రెండు గ్రామాల వద్ద మూడేళ్ల క్రితం భారీ వర్షాలకు రైల్వే మదుముల కింద దెబ్బతిన్న విద్యుత్ కేబుళ్లను పునరుద్ధరించి సోమవారం ఏపీఈపీడీసీఎల్ అధికారులు సరఫరా ప్రారంభించారు. నరసింగబిల్లి రైల్వే స్టేషన్ వద్ద, బుచ్చియ్యపేట గ్రామం వద్ద రైల్వే మదుముల కింద నుంచి విద్యుత్ కేబుల్ మూడేళ్ల క్రితం వర్షాలకు దెబ్బతింది. దాంతో పల్లపు సోమవరం, ఏనుగుతుని, ఏఎస్ పేట, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, గంటవానిపాలెం, పేరంటాలపాలెం, జోగారావుపేట తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రత్యామ్నాయంగా బయ్యవరం సబ్ స్టేషన్ నుంచి అప్పట్లో సౌకర్యం కల్పించారు. అయితే ఓవర్ లోడ్‌తోపాటు దూరం కావడం వల్ల ఆయా గ్రామాలకు తరచుగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. లో-ఓల్టేజీ సమస్య రావడంతో గతంలో వలె నరసింగబిల్లి సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా చేయడానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ఏపీఈపీడీసీఎల్ అధికారుల దృష్టికి తెచ్చారు. ఈ మేరకు కేబుల్ పునరుద్ధరణకు ఈపీడీసీఎల్ అధికారులు ప్రయత్నించగా, రైల్వే శాఖ అధికారులు అందుకు నిరాకరించారు. దీంతో అనుమతులు తీసుకొని నిబంధనల ప్రకారం రైల్వే ట్రాక్ కింద 20 అడుగుల దిగువన అండర్ గ్రౌండ్ డ్రిల్లింగ్ చేయడం ద్వారా నరసింగబిల్లి, బుచ్చియ్యపేట ప్రాంతాల్లో వ్యవసాయానికి, గృహ వినియోగానికి వేర్వేరుగా కేబుళ్ల ఏర్పాటు చేసి ఆయా గ్రామాలకు సరఫరాను నరసింగబిల్లి సబ్ స్టేషన్ నుంచి తాజాగా పునరుద్ధరించారు. ఇందుకు సుమారు రూ.40 లక్షలు వెచ్చించినట్లు ఈపీడీసీఎల్ కశింకోట సెక్షన్ ఈఈ కె. రామకృష్ణ తెలిపారు. సోమవరం గ్రామ మాజీ సర్పంచ్ గొంతిన శ్రీనివాసరావు, అగనంపూడి ఎస్ఎస్ ప్రసాద్, విద్యుత్ ఏఈలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రేషన్‌కు నగదు బదిలీ సరికాదు

అనకాపల్లి: కూటమి అధికారం చేపట్టిన ఏడాది పాలనలో వలంటీర్ వ్యవస్థ, పశువైద్య సంచార వాహనాలు, రేషన్ వాహనాలను రద్దు చేసిందని, రేషన్ దుకాణాల్లో నిత్యావసర సరుకులు నిలుపుదల చేసి నగదు చెల్లించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయడం తగదని ప్రజా సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు బొట్టా చిన్నయాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్ సరుకులు వద్దనుకుంటే నగదు ఇస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ నిర్ణయం ప్రజా పంపిణీ వ్యవస్థను నీరుగార్చి, మార్కెట్‌ల్లో ధరలు పెరగడానికి దారితీస్తుందన్నారు. నగదు బదిలీ పేరుతో పేదల కడుపు కొట్టొద్దన్నారు. రేషన్ ద్వారా తీసుకుంటున్న బియ్యం అమ్ముకుంటున్నారనే పేరుతో దొడ్డిదారిన నగదు బదిలీ పథకాన్ని ప్రవేశ పెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ విధానం ప్రజా పంపిణీ వ్యవస్థను ప్రజల నుంచి దూరం చేయడమేనన్నారు. మార్కెట్లో బియ్యం ధరలు పెరిగినా ప్రభుత్వమిచ్చే నగదు మాత్రం పెరగదని, అంతిమంగా పేదలు నష్టపోతారన్నారు. నాణ్యమైన సన్న బియ్యం సరఫరా చేస్తే రూపాయికి ఇచ్చే కిలో బియ్యం వదిలేసి మార్కెట్లో రూ.60కు ఎందుకు కొనుగోలు చేస్తారని ప్రశ్నించారు. రేషన్ అక్రమ రవాణా అడ్డుకట్టకు నాణ్యమైన సన్నబియ్యం పంపిణీ చేయడమే పరిష్కారమన్నారు. బతుకుదెరువు కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లిన వలస కూలీలకు రెండు మూడు నెలలకు ఒకసారి రేషన్ తీసుకునే వెసులుబాటు కల్పించాలని కోరారు.

ఉపాధి బిల్లులు వెంటనే చెల్లించాలి

కె.కోటపాడు : ఉపాధి కూలీలకు చేసిన పనులకు చెల్లించాల్సిన బకాయిలను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు గండి నాయినిబాబు డిమాండ్ చేశారు. సూర్రెడ్డిపాలెం గ్రామంలో సోమవారం ఆయన ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఉపాధి హామీ పథకం వీఆర్పీ, ఉద్యోగులకు కూడా బకాయి వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రేషన్‌కు బదులుగా నగదు ఇస్తామని ప్రకటనలు మానాలని ఆయన కోరారు. ఇచ్చిన నగదుకు కార్యక్రమంలో సీపీఎం నాయకులు రొంగలి ముత్యాలనాయుడు, సూర్యానారాయణ, ఈర్లె సూర్యనారాయణ పాల్గొన్నారు.

వెన్నుపోటు దినం విజయవంతం చేయండి

- రేపు పార్టీ శ్రేణులతో భారీ బైక్ ర్యాలీ
- పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్


సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు


వెన్నుపోటు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మలసాల భరత్ కుమార్, బీవీ సత్యవతి, పార్టీ నాయకులు

అనకాపల్లి: కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో పేదలకు ఒక సంక్షేమ పథకం అమలు చేయకపోవడంతో ఈ నెల 4న వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ తెలిపారు. స్థానిక రింగ్ రోడ్డు పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు ఆధ్వర్యంలో నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. భరత్‌కుమార్ మాట్లాడుతూ వెన్నుపోటు దినం సందర్భంగా స్థానిక రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ నియోజకవర్గ పార్టీ శ్రేణులతో బైక్ ర్యాలీ నిర్వహించి, తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు. అనకాపల్లి పట్టణ, మండలం, కశింకోట మండలం పార్టీ శ్రేణులు అదేరోజు ఉదయం 9 గంటలకు పార్టీ కార్యాలయానికి చేరుకోవాలని కోరారు. సీఎం చంద్రబాబు ఏడాది పాలనలో సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో విఫలమవ్వడంతో ప్రజలు పక్షాన పోరాటం చేస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులపై కేసులు నమోదు చేయడం తప్ప రాష్ట్ర అభివృద్ధిని గాలికి వదిలేశారన్నారు. రాష్ట్రంలో ఇసుక, ల్యాండ్ మాఫియా పెరిగిపోయిందన్నారు. వైఎస్సార్ కడపలో టీడీపీ మహానాడు నిర్వహించి, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని విమర్శించడమే తప్ప రానున్న నాలుగేళ్ల పాలనలో అమలు చేయాల్సిన సంక్షేమ పథకాలు గురించి ప్రస్తావన లేదన్నారు.

ఉచిత బస్సుకు ఎన్ని నిబంధనలో... : మాజీ ఎంపీ సత్యవతి

మాజీ ఎంపీ బీవీ సత్యవతి మాట్లాడుతూ ఎస్సీ, బీసీ, ఎస్టీ కులాలకు వైఎస్సార్‌సీపీ పాలనలో అనేక సంక్షేమ పథకాలు, కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, అర్హులకు బ్యాంక్ రుణాలు మంజూరు చేస్తే కూటమి పాలనలో టీడీపీ నాయకులకు ఇవ్వడం ఏమిటని ఆమె ప్రశ్నించారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అంటున్నారని, ఈ పథకంలో ఎన్ని నిబంధనలు పెడతారో అర్థం కావడం లేదన్నారు. మాజీ సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి పాలనలో అమరావతిలో నిరుపేదలకు గృహాలను నిర్మించి ఇస్తే కూటమి పాలనలో భూములు దోచుకుంటున్నారని దుయ్యబట్టారు. లాభాల్లోని విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేయడం అన్యాయమన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా దీనిపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలను రోడ్డు పాలుచేసే పరిస్థితిని సీఎం చంద్రబాబు తీసుకువచ్చినట్లు ధ్వజమెత్తారు. బీజేపీతో పొత్తు ఉన్నందున్న తక్షణమే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలన్నారు. ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ మాజీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ కూటమి ఏడాది పాలనపై ప్రజలు విరక్తి చెందారన్నారు. ఎప్పుడు ఎన్నికలొచ్చినా వైఎస్సార్‌సీపీని గెలిపించుకుని సంక్షేమ పథకాలు అందుకోవడానికి ఎదురు చూస్తున్నారన్నారు. అనంతరం వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన మలసాల కుమార్‌రాజాతోపాటు భరత్‌కుమార్, బీవీ సత్యవతిలను పార్టీ శ్రేణులు శాలువాలు, గజమాలలతో సత్కరించారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు, అనకాపల్లి, కశింకోట మండలాల అధ్యక్షులు పెదిశెట్టి గోవింద్, మలసాల కిశోర్, కశింకోట జెడ్పీటీసీ దంతులూరి శ్రీధర్‌రాజు, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్, జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షుడు పల్లేల సాయికిరణ్, 83, 84 వార్డు ఇన్‌చార్జులు జాజుల రమేష్, కోరుకొండ రాఘవ, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు కె.పద్మ, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు పెతకంశెట్టి జోసెఫ్, నాయకులు బొడ్డేడ శివ, బొడ్డేడ లక్ష్మీనరసింహం, కరక సోమునాయుడు, దాడి నారాయణ రావు, కలగ గున్నయ్యనాయుడు, తమ్మిపల్లి శోభా, హైమావతి, లక్ష్మి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యానవన సాగు లాభదాయకం


మాట్లాడుతున్న ఉద్యానవన విస్తరణ అధికారి ప్రవీణ

కశింకోట: ఉద్యానవన సాగు లాభదాయకంగా ఉంటుందని, వీటిని చేపట్టడం పట్ల రైతులు దృష్టి సారించాలని ఉద్యానవన విస్తరణ అధికారి ప్రవీణ తెలిపారు. మండలంలోని జి. భీమవరంలో బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం, జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు పంటల సాగుపై సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మామిడి, జీడి, తదితర పండ్ల తోటలు, కొబ్బరి, కూరగాయలు వగైరా సాగు చేపట్టాలన్నారు. వీటి సాగులో యాజమాన్య పద్ధతులు పాటించితే దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయన్నారు. వ్యవసాయ శాఖ అనకాపల్లి విభాగం సహాయ సంచాలకుడు ఎం. రామారావు మాట్లాడుతూ సాగులో సేంద్రియ ఎరువుల వాడకం పట్ల రైతులు దృష్టి సారించాలన్నారు. జిల్లా రిసోర్స్ కేంద్రం ఏడీఏ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఖరీఫ్ వరి సాగులో మెలకువలను వివరించారు. కృషి విజ్ఞాన కేంద్రం భూసార శాస్త్రవేత్త బి. శ్రీహరిరావు సహజ ఎరువుల వాడకం ఆవశ్యకతను వివరించారు. పశువైద్య శాస్త్రవేత్త విజయ రాజ్ఞి పశువుల సంరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేశారు. వ్యవసాయ అధికారి ఎం. స్వప్న ఖరీఫ్ వరి సాగుకు ముందు పచ్చిరొట్ట ఎరువులు జల్లుకోవాలన్నారు. సాగు చేసి ఎదిగిన తర్వాత వాటిని దమ్ములో కలియదున్నుకుంటే భూమి సారవంతం కావడంతో పాటు పంట దిగుబడి పెరుగుతుందన్నారు. రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

పెందుర్తి: మండలంలోని చింతలగ్రహారానికి చెందిన ఓ వివాహిత అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ తెలిపిన వివరాలు.. పెంటకోట నరేష్, శ్యామల(22) దంపతులు గ్రామంలో నివాసం ఉంటున్నారు. స్థానికంగా రాడ్ బెండింగ్ పనులు చేసే నరేష్ గత నెల 25న పనికి వెళ్లిపోయాడు. ఇంటికి వచ్చేసరికి భార్య కనిపించలేదు. పోలీసులను ఆశ్రయించాడు.